
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 : కనిష్ఠం 25.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 16 జూలై 2024



రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపిన గ్రామస్థులు



మామడ, జూలై 15 : మండలంలోని పరిమండల్ గ్రామంలో ఒకటవ వార్డుకు చెందిన ఇళ్లలోని రోడ్డు వర్షానికి బురద మయం కావడంతో నడవడానికి, బయటకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది కలుగుతుందని గ్రామస్థులు వాపోయారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోకపోవడంతో సోమవారం రోజున రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారం చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



పెంబి మండలంలో గత ఏడాది వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన పస్పుల వంతెన దృశ్యాలు (ఫైల్)

గత ఏడాది వరదలకు కడెం మండలం పాండ్వాపూర్ సమీపంలో వంతెనకు ఇరువైపులా తెగిపోయిన దృశ్యం (ఫైల్)

రోడ్ల కోసం జనం గోస

- అవస్థల్లో పల్లెదారులు
- ఆందోళన బాటలో జిల్లా వాసులు
- అటకెక్కిన పీఆర్, ఆర్ అండ్ బీ ప్రతిపాదనలు
- నిధులు మంజూరు కాక ఏళ్ల నుంచి తిప్పలు
- దయనీయంగా కూలిన వంతెనలు
- ఇప్పటికీ మరమ్మతులు కరువు
- కొత్త సర్కారుపైనే కోటి ఆశలు

నిర్మల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పల్లెదారుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు రెండు మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల నిర్మాణాలు అలాగే వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడం గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. గత రెండు సంవత్సరాల క్రితం భారీ వరదలకు కుప్ప కూలిన అనేక వంతెనలను ఇప్పటి వరకు పునర్ నిర్మించలేదు. కనీసం వాటి మరమ్మతులకు సైతం చర్యలు చేపట్టకపోవడం సర్కారు నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని అంటున్నారు. కడెం, పెంబి, దస్తూరాబాద్, ఖానాపూర్, మామడ, కుభీర్, తానూర్‌తో పాటు తదితర మండలాల్లోని అనేక మారుమూల గ్రామాలకు ఇప్పటికి కనీసస్థాయిలో రోడ్డు సౌకర్యం లేదు. పెంబి, దస్తూరాబాద్, కడెం మండలాల్లోని వాగులపై గల అనేక వంతెనలు వరదలతో కుప్పకూలిపోయినప్పటికీ ఇప్పటికీ వాటి పునర్‌నిర్మాణం కోసం చర్యలు చేపట్టలేదు. ఈ వంతెనల మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ దాదాపు మూడేళ్ల నుంచి ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రజలు రోడ్ల కోసం ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఆ ఆందోళనల తీవ్రత కూడా పాలకులకు పట్టడం లేదంటున్నారు. ఎన్నికల సమయంలో రోడ్లు, వంతెనలు నిర్మించకుంటే తాము ఓటు వేయబోమంటూ కూడా పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. అయితే అధికారులు వారికి నచ్చజెప్పి ఓటింగ్ పాల్గొనేట్లు చేశారే తప్ప వారి సమస్యను ఇప్పటి వరకు పరిష్కరించలేదు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల పరిధిలోని రోడ్లు, వంతెనల ప్రతిపాదనలకు ఇప్పటికి మోక్షం లభించడం లేదంటున్నారు. కాగా రోజురోజుకు సమస్య తీవ్రం కావడంతో మారుమూల పల్లెల ప్రజలు ఆందోళన బాట చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే మామడ మండలం పరిమండల్ గ్రామస్థులు సోమవారం వినూత్నంగా నిరసన చేపట్టి అధికారులపై ఒత్తిడి పెంచారు. వీరంతా గ్రామంలోని బురద రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలపడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. వంతెనల విషయంలో కూడా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అనేక గ్రామాలు వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతోందని అంటున్నారు.

అటకెక్కిన పీఆర్ ప్రతిపాదనలు

కాగా జిల్లాలోని గ్రామీణ రోడ్ల మరమ్మతులు, ఆధునికీకరణ కోసం పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖలు రూపొందిస్తున్న ప్రతిపాదనలు ప్రతీఏటా బుట్టదాఖలవుతున్నాయన్న వాదనలున్నాయి. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు వర్షాల కారణంగా కొట్టుకుపోయిన రోడ్లతో పాటు కొత్తగా నిర్మించాల్సిన రోడ్ల విషయంలో కూడా ప్రతిపాదనలు రూ పొందించి ఇప్పటికే సర్కారుకు నివేదించారు. జిల్లాలో మొత్తం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 80 గ్రామాల రోడ్ల మరమ్మతులకు వంద కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు నయా పైసా మంజూరు కాలేదు. అలాగే గతంలో రూపొందించిన ప్ర తిపాదనలకు సైతం మోక్షం లభించలేదు. అధికారులు ప్రతియేటా అంచ నాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపడం ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను పక్కన పెట్టి నిధులు మంజూరు చేయకపోతుండడం రివాజుగా మారిందని అంటున్నారు.

మెయింటెనెన్స్ నిధులు కూడా మంజూరు కాలేదు



జిల్లావ్యాప్తంగా గత ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా చాలా చోట్ల ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని రోడ్లు, వంతె నలు దెబ్బతిన్నాయి. ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు దాదాపు 40 పనుల కోసం 36 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో మెయింటెనెన్స్‌లో భాగంగా మరమ్మతులు చేయించినందుకు గాను దాదాపు కోటి రూపాయల నిధులు ఖర్చయ్యాయి. ఈ నిధులు కూడా మంజూరు కాక పోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- అశోక్ కుమార్, ఈఈ, రోడ్లు భవనాల శాఖ, నిర్మల్ జిల్లా

ఆర్ అండ్ బీది అదే దుస్థితి

కాగా రోడ్డుభవనాలశాఖ ఆధ్వర్యంలోని 40 రోడ్ల పరిస్థితి కూడా దయనీయంగానే ఉందని అంటున్నారు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులు దాదాపు 40 రోడ్ల మరమ్మతులకు గానూ రూ.30 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి నిధులు విడుదల చేయాలని పలుసార్లు కోరారు. అయితే ఆర్ అండ్ బీ ప్రతిపాదనలను ప్రభుత్వం పెదగా పట్టించుకోలేదంటున్నారు. కేవలం చిన్న చిన్న మెయింటనెన్స్ పనులకు మాత్రం కోటి రూపాయలను విడుదల చేసి ప్రభుత్వం మిగతా నిధుల విషయంలో ఇప్పటికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులు ప్రతీఏటా రూపొందిస్తున్న ప్రతిపాదనలకు మోక్షం లభించక పోతుండడంతో వారంతా కొత్తగా ప్రతిపాదనల తయారీకి సుముఖత వ్యక్తం చేయడం లేదన్న వాదనలున్నాయి.

కుప్పకూలిన వంతెనలతో స్తంభించిన రాకపోకలు

కాగా కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల్లో గత వరదల సమయంలో వాగుల మధ్య నిర్మించిన అనేక వంతెనలు కుప్పకూలిన సంగతి తెలిసిందే. పెంబి మండలంలోని పస్పుల్లా వంతెన వర్షకాలంలో వరద తీవ్రతకు కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు ఆ వంతెనను పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఈ వంతెన పస్పుల్లా గ్రామంతో పాటు హరిచంద్‌తాండ, వెంకం పోచంపాడ్, రాయదారి, పోచంపెల్లి, తులసీపేట, నాయికపుగూడ తదితర గ్రామాలకు ఈ వంతెన లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే ఖానాపూర్ మండలం ఎర్వచింతల్, కడెం మండలంలోని దత్తోజిపేట మధ్యన గల భారీ వంతెన సైతం గత ఏడాది వర్షకాలంలో కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు ఆ వంతెనను ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ వంతెనలను పునర్ నిర్మించి అవసరమైన చోట్ల చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నప్పటికి ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం కనీసస్థాయిలో చర్యలు చేపట్టకపోవడం అక్కడి ప్రజలకు శాపంగా మారుతోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్లు, వంతెనల నిర్మాణాలకు సత్వరమే నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం

గత ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గల రోడ్లు, వంతెనలు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఆయా పనులను చేపట్టేందుకు దాదాపు 100 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ఇప్పటి వరకు నయా పైసా మంజూరు కాలేదు. నిధులు మంజూరు అయితేనే పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. గతంలో చేసిన పనులకు సైతం ఇంతవరకు బిల్లులు మంజూరు కాలేదు.

- శంకరయ్య, ఈఈ, పంచాయతీ రాజ్ శాఖ, నిర్మల్

పస్పుల వంతెన లేక ఇబ్బందులు పడుతున్నాము

పస్పుల వంతెన లేక ఆయా గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు మం డలంలోని పస్పుల వంతెన కొట్టుకుపోవడంతో దాదాపు 10 గ్రామాలకు అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన పనులు చేపట్టాలి.

- సుదర్శన్, హరిచంద్ తండా

బాసర ట్రిపుల్ ఐటీ రెండవ జాబితా విడుదల

బాసర, జూలై, 15 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీకి 2024-2025 విద్యాసంవత్సరానికి ఎంపికైన విద్యార్థుల రెండవ జాబితాను యూనివర్సిటీ అధికారులు సోమవారం విడుదల చేశారు. మొదటి విడతలో ఎంపికైన విద్యార్థుల్లో కౌన్సిలింగ్‌కు గైర్హాజరైన వారి స్థానంలో భర్తీ చేసేందుకు రెండవ జాబితాను రూపొందించారు. మొదటి విడతల కౌన్సిలింగ్‌లో 102 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా ఆ సీట్లను మెరిట్ జాబితా నుండి అర్హులైన వారిని తీసుకొని రెండవ జాబితాలో ఎంపికైన 102 మంది విద్యార్థులతో సోమవారం విడుదల చేసినట్లు యూనివర్సిటీ అధికారులు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. వీరితో పాటు ఇతర రాష్ట్రాల కోటా కింద 16 మంది విద్యార్థుల జాబితా కూడా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు, వీరందరికి ఈ నెల 19వ తేదిన కౌన్సిలింగ్ ఉంటుందని అన్నారు.

రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కాలనీ వాసులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

నిర్మల్ అర్బన్, జూలై 15 : పట్టణంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో గల ఐదవనంబర్ రోడ్డును ఆక్రమించిన కందుల రాందాస్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసి కుంటాల కిషన్‌తో పాటు స్థానికులు సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డును ఆక్రమించడం వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణకు పాల్పడ్డ సదరు వ్యక్తికి స్థానిక మున్సిపల్ ఛైర్మన్ అండదండలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. రోడ్డును ఆక్రమించిన సదరు వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకొని, కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా చూడాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాలనీ వాసులు విశ్వనాథ్, మంచాల రాజ్ కుమార్, కే. రాఘవేందర్, తదితరులు ఉన్నారు.

జిల్లాలో భారీ వర్షం

- నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక
- ప్రజల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు



జిల్లా కేంద్రంలో రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీటి దృశ్యం

నిర్మల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో కురిసిన భారీ వర్షానికి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతా వరణశాఖ హెచ్చరించింది. వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో నిర్మల్ మున్సిపల్ అధి కారులు అప్రమత్తమయ్యారు. పట్టణ ప్రజలకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 7036661070 ఫోన్ చేసి సహాయం పొందాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



హాజరైన అధికారులు



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూలై 15 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్య, వ్యవసాయం, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అలాగే సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను సమర్పించాలన్నారు. వసతిగృహ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాల రిపోర్టులను సమర్పించాలని ఆదేశించారు. వర్షాకాల నేపథ్యంలో ప్రతి హాస్టల్‌లో వైద్య శిబిరాలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు చికిత్సలు చేసి, అవసరమైన మందులను అందజేయాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. ధనరాజ్‌కు సూచించారు. వసతి గృహాలలో జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక విశ్రాంతి హాల్‌ను ఏర్పాటు చేయాలని, మెనూ ప్రకారం అందించే టిఫిన్, భోజనం, స్నాక్స్ తదితర వివరాలను ప్రదర్శించాలని సూచించారు. విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నిచర్, ఫ్యాన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్‌వో భుజంగ్‌రావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువత అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లొద్దు



నిర్మల్ పోలీసు... మీ పోలీసు... ప్రారంభిస్తున్న దృశ్యం

నిర్మల్ టౌన్, జూలై 15 : యువతను ఉద్దేశిస్తూ గంజాయి, మద్యం, పేకాట ఇతర అసాంఘిక కార్యక్రమాల జోలికి పోయి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్పీ జానకిషర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్మల్ పోలీసు.. మీ పోలీసు అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంజాయి రవాణా, గుడుంబా, ఇతర చట్ట వ్యతిరేక చర్యలకు అడ్డుకట్ట వేయడానికి గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు. కళాబృందం గంజాయి తీసు కోవటం వల్ల వచ్చే అనర్థాలను, తాగి బండి నడపటం వల్ల కుటుంబాలు ఎలా నష్టపోతాయే వారి ప్రదర్శనలో చూపించారు. నిషేధిత వస్తువులు వాడటం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకి సమాచారం ఇవ్వాల్సిందిగా తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఆర్ఎస్ఐ రవికుమార్, జిల్లా షీటీం సిబ్బంది, కళాబృందం పాల్గొన్నారు.

బోరుబావుల కింద ఊపందుకున్న వరినాట్లు



నాట్లు వేస్తున్న మహిళలు



నాట్ల కోసం సిద్ధమైన వరి నారు

భైంసా, జూలై 15 : డివిజన్ పరిధిలో క్రమక్రమంగా వరినాట్లు ఊపందుకుంటున్నాయి. భైంసా, ముథోల్ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలలో 3700 హెక్టార్లలో వరి సాగుచేస్తారు. 3034 హెక్టార్లలో సాగునీటి పథకాల ద్వారా, 666 హెక్టార్లు వర్షాధారితం ద్వారా వరిని సాగుచేయను న్నట్లుగా అధికారులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం వరుణుడి కరుణ అంతంత మాత్రంగానే ఉండటంతో సాగు నీటి వనరుల కింద ,వర్షాదారంపై వరి సాగు చేసే రైతాంగం ఇంకా నాట్లను వేసే చర్యలను ఆరంభించలేదు. బోరుబావుల ద్వారా సాగునీటి వ్యవస్థ గల రైతులు వరి నాట్లు వేసే చర్యలను ముమ్మరం చేశారు. గత సంవత్సరం ముథోల్ నియోజక వర్గ పరిధిలోని లోకేశ్వరం మండలంలో 1253 హెక్టార్లలో, ముథోల్ మండలంలో 728 హెక్టార్లలో, భైంసా మండలంలో 1001 హెక్టార్లలో, కుభీర్ మండలంలో 313 హెక్టార్లలో, తానూర్ మండలంలో 313 హెక్టార్లలో, కుంటాల మండలంలో 650 హెక్టార్లలో వరిని సాగుచేశారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వరి నారుమడులు సిద్ధమయ్యాయి. అయితే బోరుబావుల కింద సాగు చేసే రైతాంగం మాత్రమే నాట్లను వేసుకుంటుండగా ఇతర రైతాంగం నాట్లు వేసే విషయంలో వరుణుని కరుణ కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

అందకూర్‌లో కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ సైలు

కుంటాల , జూలై 15 : మండలంలోని అందకూర్ గ్రామంలో సోమవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ సైలు మాట్లాడారు. వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉంచుకోవాలని, లేదంటేప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందుల ఏర్పడతాయన్నారు. నిషేదిత గుట్కా, గంజాయి గురించి ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ట్రెండ్‌లో ఉన్న రీల్స్, అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాంకేతికతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 82 బైక్లు, రెండు ఆటోలను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రజినీకాంత్, కుభీర్ ఎస్సై రవీందర్, సిబ్బంది ఉన్నారు.

గుట్కాస్వాధీనం



గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

లోకేశ్వరం, జూలై 15 : తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన అక్రమంగా తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను సోమవారం లోకేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సక్రియానాయక్ తెలిపిన వివరాల ప్రకారం... భైంసా నుంచి లోకేశ్వరంకు అక్రమంగా గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పుస్పూర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేపట్టగా టీఎస్ 18 3937 నంబర్ గల ద్విచక్ర వాహనంపై తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందని, దాదాపు దాని విలువ రూ. 25,000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. నిందితుడు అబ్దుల్ నహీంను అరెస్టు చేసి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కుంటాలలో అమ్మమాట అంగన్‌వాడీ బాట

కుంటాల , జూలై 15 : మండల కేంద్రంలో శుక్రవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీ డీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ఇన్‌చార్జీ హెచ్ఎం నాగనాథ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి : ఎంపీ

ఇంద్రవెల్లి, జూలై 15 : స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆదిలాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించి నాగోబాను దర్శించుకున్నారు. మెస్రం వంశీయులతో కలిసి నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. నాగోబా ఆలయాభివృద్ధి, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.సన్మానం సభలో ఎంపీ గోడం నగేష్‌కు మండల శాఖ ఆధ్వర్యంలో శాలువలతో సన్మానం చేశారు. ముందుగా ఇటీవల ఆకాల మరణం పొందిన మాజీ ఎంపీ రమేష్ రాథోడ్‌కు రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో తాను మంత్రి, ఎంపీగా ఉన్నప్పుడే జిల్లాతో పాటు ఇంద్రవెల్లి మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కనీస రోడ్, తాగు నీరు, విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. కేంద్రంలో మూడో సారి అధికారంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రధాన మంత్రి నరేంద్రమోది నిరుపేద కుటుంబాలకు పీఎం ఆవాస్ యోజన పథకం 3 కోట్ల ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో జోక్యం చేసుకోవద్దన్నారు. అనంతరం ఆయా గ్రామాల నుండి హజరైన కార్యకర్తలు ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీ గోడం నగేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, బీజేపీ మండల అధ్యక్షులు ఆరెల్లి రాజలింగు, జిల్లా ఉపాధ్యక్షులు సిడాం భీంరావ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశీయులు శేఖర్‌బాబు, నాగ్‌నాథ్, సోనేరావ్, తుకారం , బీజేపీ నాయకులు, కనక తుకారం, మరప, రాజు, మస్కే రాజవర్ధన్, జాదవ్ సమన్‌బాయి, ఆడప్ చంపత్‌రావ్ తదితరులున్నారు.

రూ.16 లక్షల విలువైన గుట్కా పట్టివేత

మావల, జూలై 15: కంటైనర్‌లో జిల్లాకు దిగుమతి అవుతున్న అక్రమ గుట్కాను మావల పోలీసులు పట్టుకున్నారు. మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం ఢిల్లీ నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అస్లాం ట్రేడర్స్‌కు కంటైనర్‌లో గుట్కావస్తుండగా టేలర్స్ కాలనీ సమీపంలో పట్టుకున్నామన్నారు. పట్టుకున్న కంటైనర్‌లో గుట్కా విలువ సుమారు రూ. 16 లక్షలు ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ మేరకు గుట్కాను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పార్టీని విజయపథంలో నిలిపేందుకు కృషి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 15 : రాబోయే ఎన్నికలకు సన్నద్ధమై కాంగ్రెస్‌పార్టీని విజయ పథంలో నిలపాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజాసేవ భవన్ క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇటీవల ఐదేండ్ల పదవి కాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. వారిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని పంచాయతీలు మండల పరిషత్, జిల్లా పరిషత్‌లను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోను కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, ఇందులో తుమ్మల అరుందతి వెంకట్‌రెడ్డి, భూపెల్లి శ్రీధర్, సెడ్మకి ఆనంద్‌రావు, మంచికట్ల ఆశమ్మ, రంగినేని శాంతన్‌రావు, చరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ధర లేకపోతే గోదాములో నిల్వ చేసుకోండి'

తలమడుగు, జూలై 15 : రైతుల పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోతే ప్రభుత్వ గోదాంలో నిల్వ చేసుకోవాలని ఇనిస్ట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ఐసీఎం ప్రోగ్రాం డైరెక్టర్ శ్యాంకుమార్ సూచించారు. సోమవారం తలమడుగు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో సుంకిడి రైతు వేదికలో రైతులకు అవగహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్యాంకుమార్ మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్టించి పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోతే ప్రభుత్వ గోదాంలో పంటలను నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ గోదాముల్లో పంటలు నిలువ చేసుకున్న రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా 80 శాతం బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. తలమడుగు మండలంలో గోదాంల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం పంటలను ఏవిధంగా గోదాముల్లో నిల్వ ఉంచాలో వాటిపై రైతులకు అవగహన కల్పించారు. ఇందులో చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, సీఈవో మోతే శ్రీనివాస్, సిండికేట్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ యాదవ్, డైరెక్టర్లు ప్రతాప్ శ్రీనివాస్, సెక్రటరీలు సాగర్, గంగయ్య భీమావు సిబ్బంది, ముస్తఫా, సత్యనారాయణ, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పీరీల సందడి...

తలమడుగు , జూలై 15 : మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే మొహరం పండుగ ఉత్సవాలు పల్లెల్లో పీర్ల సందడి మొదలయ్యాయి. కులమతకు విభేదాలకు తావీయకుండా ప్రతి ఒక్కరూ జరుపుకుంటారు. వారం రోజుల పాటు జరుపుకుని ఈ పండుగ తెలంగాణ ప్రాంతం ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువ జరుపుకుంటారు. ముఖ్యంగా తలమడుగు మండలం రుయ్యాడి పీరీలకు ఘనమైన చరిత్ర ఉండటంతో వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈనెల 15 నుంచి 18 వరకు మొహరం ఉత్సవాలను జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అదే విధంగా పీరీలకు రంగురంగుల వస్త్రాలతో అలంకరించి భజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. అదే విధంగా తలమడుగు మండల కేంద్రంలో గల పీరీలు తలమడుగు గుట్ట వద్ద గల దర్గా వద్దకు వెళ్లి వచ్చాయి. నమ్ముకున్న వారికి నమ్ముకున్నంతగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. రాత్రిపూట స్థానిక సవారీ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్ద ప్రతిరోజు రాత్రి భక్తులు అచ్చదుల అంటూ కోలాటం ఆడుతూ పండుగను జరుపుకుంటారు.

'డీజిల్ డబ్బులు ఇప్పించండి'

భోథ్, జూలై 15: గత పార్లమెంట్ ఎన్నికల్లో వాహనాలకు డీజిల్, పెట్రోల్ పోయడం జరిగిందని అయితే తనకు రావాల్సిన ఐదు లక్షల 37 వేల రూపాయలు ఇవ్వడం లేదని రంజిత్ పెట్రోల్ పంప్ యజమాని రాకేష్ కస్తూరి సోమవారం జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. అయితే ఎన్నికల సందర్భంగా ఐటీడీఏ పీవోతో పాటు ఆర్డీవో స్థానిక తహసీల్దార్లు డీజిల్, పెట్రోల్ పోయాలని ఇందుకు సంబంధించిన డబ్బులు ఎన్నికల అనంతరం చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారని బంకు యజమాని తెలిపారు. తాను 18 లక్షల రూపాయల విలువ చేసే ఇంధనం పోయడం జరిగిందని అందులో నుంచి మిగిలిన ఐదు లక్షల 37 వేల రూపాయలు ఇవ్వడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ తక్షణమే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని జాప్యం ఎందుకు జరిగిందని విషయం కింది స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారని బంక్ యజమాని పేర్కొన్నారు.

'సాయినగర్ సమస్యలను పరిష్కరించండి'

భోథ్, జూలై 15: మండలకేంద్రం సమీపంలో నూతనంగా వెలిసిన సాయినగర్ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని ప్రజలు పరిష్కారం కాని సమస్యలతో సతమతమవుతున్నారని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేష్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన సాయినగర్‌లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు అందులో పాములు, విష కీటకాలు ఉన్నాయని రాత్రిపూట ఈ రోడ్డుపై నడిచేందుకు కాలనీ వాసులు జంకుతున్నారన్నారు. మురికి కాలువల నిర్మాణం చేపట్టకపోగా మురుగు నీరు ఉండటంతో ఈగలు, దోమలు పెరిగాయని పేర్కొన్నారు. తక్షణమే కాలనీలో సమస్యలు పరిష్కరించకపోతే మలేరియా, డెంగ్యూ వంటివి వచ్చే ఆస్కారం ఉందని ఆయన వివరించారు. ఆయన వెంట ఆరే రమేష్ పాటిల్ ఉన్నారు.



కాప్రీ మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జోగు రామన్న

'ప్రజలు పాడిపంటలతో చల్లగా ఉండాలి'

జైనథ్, జూలై 15: ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని కాప్రీ గ్రామంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ ఆలయంలో మైసమ్మ విగ్రహాన్ని డప్పులు బజాల మధ్య భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాప్రీ గ్రామ ప్రజలు మహిళలు మైసమ్మ నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఎం.గోవర్ధన్, ఎస్.లింగారెడ్డి, గిమ్మా ఎంపీటీసీ కోలబోజన్న, బెల్లూరి ఎంపీటీసీ సోమ ఇంద్రారాంరెడ్డి, నిర్సన్న గ్రామ సర్పంచ్ ఎం.ఊశన్న, బీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పి.గణేష్‌యాదవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొహర్రం ఉత్సవాలు

ఉట్నూర్, జూలై 15: ఉట్నూర్ ఏజెన్సీలో మొహర్రం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండలంలోని ఉట్నూర్, దంతంపల్లి, బీర్సాయిపేట, షాంపూర్, ఎంకా, తదితర గ్రామాలతో పాటు ఏజెన్సీలోని గిరిజన గూడాలలో కూడా సవారీలను ఏర్పాటు చేసుకుని మండపాలవద్ద హసేన్ హుస్సేన్ పీర్లకు పూజలుచేసి నైవేద్యాలు సమర్పిస్తున్నారు.ఉట్నూర్ పట్టణంలోని పోచమ్మవాడ, శాంతినగర్ ప్రాంతాలలో పీరీలను ఏర్పాటు చేశారు. సోమవారం పీరీలకు శోభాయాత్ర నిర్వహించారు.

మహిళల గోరింటాకు సంబురం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 15: పట్టణంలోని కైలాస్‌నగర్ హనుమాన్ ఆలయంలో కందిమౌనాశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మహిళలు ఆషాఢమాసం సంబరాలు జరుపుకున్నారు. కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గోరింటాకు నూరుకున్నారు. ముందుగా గౌరీదేవి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పాటలు పాడుతూ ఒకరికొకరు గోరింటాకును పెట్టుకున్నారు. ఈ సందర్భంగా కందిమౌనాశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇది అనాధిగా వస్తున్న మన సాంప్రదాయమని అన్నారు. ప్రకృతి సహజ సిద్ధంగా లభించే ఈ గోరింటాకులో ఎన్నో ఔషధ గునాలుంటాయని తెలిపారు. రోజంతా నీటిలో పని చేసే గృహిణులకు బ్యాక్టిరియా, ఇతర సూక్ష్మజీవులతో చర్మవ్యాధులు ప్రబలకుండా కాపడుతుందని తెలిపారు. ఇందులో పెద్ద సంఖ్యలో కాలనీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



గౌరీదేవి ప్రతిమకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ● సిరికొండలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ● కౌట(బి)లో మొహరం వేడుకలకు హాజరు



సిరికొండలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



కౌటా(బి) గ్రామంలో పీరీలను దర్శించుకున్న అనిల్‌జాదవ్

సిరికొండ, జూలై 15: మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు ఓ వరం లాంటిదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం సిరికొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ప్రారంభించిన కల్యాణలక్ష్మి పథకం ప్రపంచంలోనే ఒక చరిత్ర అని అన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో సిరికొండ మాజీ ఉపసర్పంచ్ తోకల చందు తండ్రి మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ ఉపేందర్, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఒరగంటి పెంటన్న, కదం సూర్యకాంత్, జాదవ్ రోహిదాస్, ఎగ్గిడి మల్లారెడ్డి, ఒరగంటి నర్సింలు, ఎగ్గిడి ఇస్తారి, బియ్యాల మల్లేష్, ఏల్పుల మల్లేష్, చవాన్ ఈశ్వర్, తోకల చందు, తదితరులు పాల్గొన్నారు.

● కులమతాలకతీతంగా పీర్ల పండుగ వేడుకలు

భోథ్: తెలంగాణ ప్రజలు కులమతాలకతీతంగా మొహరం వేడుకలను జరుపుకోవడం అనవాయితీగా వస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. ఇందులో కౌటా(బి) గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.రామ్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు వినాయక్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

● నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ, జూలై 15: మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 11గంటలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నివాసంలో బోథ్ నియోజక వర్గంలోని ఆయా మండలాల లబ్ధిదారులకు మంజూరైన 121 సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంది. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులతో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం కోరారు.

ఐఐటీకి ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక

భోథ్, జూలై 15: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదివిన విద్యార్థి సాయి వంశీ ఐఐటీకి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఉమేష్ రావు పేర్కొన్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఈ విద్యార్థి మద్రాస్ యూనివర్సిటీలో ఐఐటీలో డాటా సైన్స్ విభాగంలో సీటు సంపాదించాలని వివరించారు. విద్యార్థి ఎంపిక పట్ల కుటుంబీకులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తపరిచారు.

కాంగ్రెస్ నేతల గురించి మాట్లాడితే ఖబడ్దార్ : కంది

ఆదిలాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ కాంగ్రెస్ నేతల గురించి మాట్లాడితే ఖబడ్దార్ అంటూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చామల కిరణ్ మీలాగా కబ్జాలు, బెదిరింపులతో ఎదిగిన నాయకుడు కాదన్నారు. ఆయన గురించి మాట్లాడితే సహించేది లేదన్నారు. నాలుగు సార్లు పోటీ చేసి ఏదో అదృష్టవశాత్తు గెలిచిన ఎమ్మెల్యే నీతులు చెప్పడం మానుకోవాలన్నారు. చామల కిరణ్ భువనగిరి గడ్డ పై చరిత్ర సృష్టించాడని ఎమ్మెల్యేకు ఏం చరిత్ర ఉందో చెప్పాలన్నారు. పాయలశంకర్ తన తీరు మార్చుకోకుంటే గుణపాఠం తప్పదన్నారు. చామల కిరణ్ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే దమ్ములేక ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోదన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న దందాలను త్వరలోనే బయట పెడతామన్నారు. బెదిరింపులు, భూకబ్జాలకు అడ్రస్‌గా మారిన ఎమ్మెల్యే ఆదిలాబాద్ ప్రజలను పట్టి పీడిస్తున్నారని ఆరోపించారు. పోలీసులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిబోజారెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, భూపెల్లి శ్రీధర్, ఆనంద్‌రావు, జహీర్‌రంజాని, మంచికట్ల ఆశమ్మ, లోక ప్రవీణ్‌రెడ్డి, డేరాకృష్ణారెడ్డి, గిమ్మ సంతోష్, కోరెడ్డి కిషన్, ఎంఏ.షకీల్ మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

'జూనియర్ కళాశాలలో భోజన పథకం అమలు చేయాలి'

ఆదిలాబాద్ రూరల్, జూలై 15: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు జవారే రాహుల్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరసన తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని అనేక సంవత్సరాలుగా ఆందోళన చేసినప్పటికీ అమలు చేయకపోవడం విడ్డురంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంపై స్పందించాలని కోరారు. ఇందులో ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ముదిరాజులను బీసీ-ఏలోకి మార్చాలి'

సిరికొండ, జూలై 15: కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన అభయహస్తం పథకం హామీలో భాగంగా ముదిరాజులను బీసీ-డి నుంచి బీసీ-ఎ లోకి మారుస్తూ, వారి సమస్యలను పరిష్కరించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని ఆ సంఘం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజుల అభివృద్ధి కొరకు ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేస్తూ ప్రకటించినందున రేవంత్ ప్రభుత్వానికి ధన్యవాదములు తెలియజేశారు. ఇదే తమ జనాభా ప్రాతిపదికన తమ అభివృద్ధికై ప్రతి సంవత్సరానికి రూ.వెయ్యి కోట్ల నిధులను విడుదల చేయాలన్నారు. గ్రామాల్లోని చెరువులు, కుంటలపై మత్స్య సంపదపై ముదిరాజ్ కులస్థులకు మాత్రమే హక్కులు ఉండేలా చట్టపరమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. 'తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు'ను ఏర్పాటు చేసి తగిన నిధులు కెటాయించి, దానికి ఒక ముదిరాజ్‌ను మాత్రమే చైర్మన్‌గా నియమించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఒరగంటి పెంటన్న, ఎగ్గిడి మల్లారెడ్డి, బోయిన్‌వాడ్ అమోల్, ఒరగంటి నర్సింలు, ఎగ్గిడి ఇస్తారి, జ్ఞానేశ్వర్, సౌదర్‌వాడ్ సుదాకర్, పరుశురామ్, తులసిదాస్, శాగంటి ఆశన్న, రుద్రారపు ఇస్తారి, రుద్రారపు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



రక్తపు మడుగులో పడి కనిపిస్తున్న దంపతులు



ఏసుల సునిత, ఏసుల లక్ష్మణ్ (ఫైల్)



అనాథలుగా మారిన పిల్లలు

భార్య గొంతు కోసిన భర్త

● భయంతో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అనుమానంతో గొంతుకోసి భార్యను హతమార్చిన భర్త అదే కత్తితో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బేల మండలం సైద్‌పూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సైద్‌పూర్ గ్రామానికి చెందిన ఏసుల లక్ష్మణ్(34), ఏసుల సునిత(30) అనే గిరిజన యువతిని గత పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంత కాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న లక్ష్మణ్ సోమవారం ఆమెతో గొడవపడి మిట్ట మధ్యాహ్నం ఇంటి ముందే కత్తితో గొంతుకోసి దారుణంగా హతమార్చాడు. దీంతో సునీత కొనఊపిరితో కొట్టుకుంటున్న పరిస్థితిని చూసి భయంతో లక్ష్మణ్ అదే కత్తితో తన గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితిని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మణ్ పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. భార్య మృతి చెందడం, భర్త ఆసుపత్రి పాలు కావడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారని గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటన సైద్‌పూర్ గ్రామంలో విషాదం నింపింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో చిన్నారులకు మంచి భవిష్యత్తు



అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భైంసా రూరల్, జూలై 15 : అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించడం వలన చిన్నపిల్లలకు మంచి భవిష్యత్తుకు బాటలు వేయాలని వానల్‌పాడ్ అంగన్‌వాడీ టీచర్ సునీత అన్నారు. అధికారుల ఆదేశాల మేరకే సోమవారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వీధి వీధిన ర్యాలీ నిర్వహించి, ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్పన గణేష్, మాజీ సర్పంచ్ పెద్ద రాజన్న, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి పథకంలో యూనిట్ల గుర్తింపును వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళాశక్తి పథకంలో యూనిట్ల గుర్తింపు ప్రక్రియను వేగవంతంచేయాలని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లో మహిళాశక్తి పథకం యూనిట్‌లు గుర్తించడంపై సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టుమేనేజర్లు, జిల్లామేనేజర్లతో సమీక్షసమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిమండలంలో మహిళా సంఘాలతో సమావేశంనిర్వహించి ఔత్సాహిక మహిళాసంఘాలను మహిళా శక్తి పథకం ద్వారా యూనిట్లు ప్రారంభించే విధంగా ప్రోత్సహించాలని తెలి పారు. చేపల పెంపకం, కోళ్లపెంపకం, డెయిరీ ఫార్మ్ నిర్వహణ, క్యాంటీన్లు, మీ సేవకేంద్రాల నిర్వహణ, చిన్నపరిశ్రమల ఏర్పాటు వంటి 5రకాల యూనిట్‌లను గుర్తించి మహిళాసంఘాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సంఘాలకు స్త్రీనిధి పథకంద్వారా రుణాలను అందించి ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం మండలాలవారీగా యూనిట్లపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విచారణ ఖైదీలతో సరిగ్గా వ్యవహరించాలి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: విచారణ ఎదు ర్కొనే ఖైదీలపట్ల సరిగ్గా వ్యవ హరించి సరైన విచారణ జరి పేలా చూడాలని సీనియర్ సివిల్‌జడ్జి యువరాజు అన్నా రు. తన కార్యాలయంలో విచారణ ఎదుర్కొనే ఖైదీలకు సంబంధించి అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జైలుజీవితం అనుభవిస్తున్న ఖైదీలు విచారణ ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖైదీలు విచారణ అనంతరం బయటికి వెళ్లే పరిస్థితి ఉంటే వారికిసమాజంలో పరిస్థితులపై అవగాహనకల్పించాలన్నారు. మళ్లీ అటువంటి నేరంజరగకుండా చూడాలని సూచించారు. జైలులో సత్ప్రవర్తన కలిగిన ఖైదీ లను విచారణకు హాజరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్య క్రమంలో సబ్‌జైలర్ ప్రేంకుమార్, డీసీఆర్పీసీఐ రమేష్ పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: జిల్లాలో సోమవారం ఓమోస్తరు వర్షం కురి సింది. ఆసిఫాబాద్ జిల్లాలోగడిచిన 24గంటల్లో జిల్లావ్యాప్తంగా 8.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా పెంచికలపేటలో 30.2మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా జైనూరులో 1మిల్లీమీటర్ వర్షం కురిసింది. మిగితా మండలాలైన దహెగాంలో 25.8మిల్లీమీటర్లు, బెజ్జూరులో 20, రెబ్బెనలో 11.8, తిర్యాణిలో 9, కాగజ్‌నగర్‌లో 8.6, వాంకిడిలో 8.2, కెరమెరిలో 4.2, లింగాపూర్‌లో 3.6, ఆసిఫాబాద్‌లో 3, సిర్పూర్(యు)లో 2, సిర్పూర్(టి) లో 1.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

నిర్మల్ మార్కెట్ కమిటీ పీఠంపై మైనారిటీల గురి

● చైర్మన్ రేసులో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజార్

● షబ్బీర్‌అలీ అండదండలు పుష్కలంగా ఉన్నట్లు ప్రచారం



నిర్మల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మార్కెట్ కమిటీ పీఠంపై మైనారిటీలు గురిపెట్టారు. ఓసీ రిజర్వుడు స్థానమైన నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఓసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు నేతలు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ పదవిని దక్కించుకునేందుకు ఎవరికి వారే తెర వెనుక పావులు కదుపుతున్నారు. అయితే ఈసారి ఎలాగైనా సరే మార్కెట్ కమిటీ ఖచ్చితంగా పాగా వేయాలని మైనారిటీ వర్గాలు భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే గత కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజార్‌కు నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇవ్వాలని కోరుతూ మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులంతా నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. ఓవైపు జిల్లాలో డీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం ఇవ్వడమే కాకుండా మరోవైపు అధిష్టానం దృష్టిలో సైతం అజార్ పేరును బలంగా వినిపించేందుకు ఓ వర్గం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు గాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కని సైతం కలిసినట్లు సమాచారం. మరోపక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితులుగా పేరున్న మాజీ మంత్రి, ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో ప్రయత్నాలు సాగుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. షబ్బీర్‌అలీ అండదండలు పుష్క లంగా ఉండడంతో ఈసారి మార్కెట్ కమిటీ పీఠం ఖచ్చితంగా అజార్‌కే దక్కవచ్చని కాంగ్రెస్ శ్రేణుల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కు సైతం డీసీసీ ఉపాధ్యక్షులుగా అజార్ సేవలందించారు. 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీతోనే తన ప్రయాణాన్ని సాగించిన అజార్ పార్టీ అధిష్టానం వద్ద క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా తనకు అవకాశం కల్పిం చాలని తన వాదనను బలంగా వినిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓవైపు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మరోవైపు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలతో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం అజార్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని కాంగ్రెస్ శ్రేణుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఖచ్చితంగా పార్టీ కోసం శ్రమించిన తనకే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వస్తుందని తన సన్నిహితుల వద్ద అజార్ ధీమా వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై వినిపిస్తున్న ఈ ఊహాగానాలకు తెరపడాలంటే మాత్రం మరికొన్ని రోజులు ఆగాల్సిందేనని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

పత్తిచేనులో కలుపు కష్టాలు..కూలీలు దొరకక రైతుల గోస

చింతలమానేపల్లి, జూలై 15: రైతులు సాగు చేసిన పత్తి చేనులో కలుపు కష్టాలు మొదలయ్యాయి. పత్తి పంటలో సాలు మధ్యలో పచ్చిగడ్డి విపరీతంగా పెరగడంతో నివారించేందుకు కొందరు రైతులు వివిధ రకాల మందులను పిచికారి చేస్తున్నారు. మరికొందరు రైతులు కూలీలను పెట్టి కలుపును తీయిస్తున్నారు. సకాలంలో కూలీలు దొరకకపోవడంతో విపరీతంగా గడ్డి పెరిగిపోతుందని రైతులు అంటున్నారు. ఆయా గ్రామాల్లోని కలుపు తీసేందుకు కూలీలకు సగటున రోజుకు రూ.300చొప్పున చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించిన అంగన్‌వాడీ సిబ్బంది



ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలు



కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే హరీష్‌బాబు ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తా వించాలని సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి, కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుకు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వారు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ లలో ఎమ్మెల్యే నివాసాలవరకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 సెప్టెంబరు 11 నుంచి అక్టోబరు4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయడంతో అప్పటి రాష్ట్రమంత్రి హరీష్‌రావు, మంత్రి సత్యవతి రాథోడ్ చర్చలు జరిపి రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.లక్ష, టీచర్‌లకు రూ.2లక్షలు, ఆసరా పెన్షన్, 6సంవత్సరాలకు రిటైర్మెంట్ అయిన వారికి వీఆర్ఎస్ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారన్నారు. రెండో పీఆర్సీలో 5శాతం ఐఆర్ ప్రకటించారని కానీ హామిలు అమలు కావడం లేదన్నారు. ఆసిఫాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు రాజేందర్, గంగామణి, శ్రీకాంత్, వని, పార్వతి, ఉమ, రాజేశ్వరి, తార, సరోజ, లత, శీల తదితరులు పాల్గొన్నారు. కాగజ్‌నగర్‌లో అంగన్‌వాడీ వెల్ఫేర్స్‌అండ్ వర్కర్స్ జిల్లా ప్రధానకార్యదర్శి త్రివేణి, సీఐటీయూ జిల్లాకార్యదర్శి ముంజంశ్రీనివాస్, అంగన్ వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమాచారితోపాటు జిల్లా కమిటీ సభ్యులు మాచర్ల వినోద, కృష్ణవేణి, వైఅరుణ, మండలాలు, జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ సీఐ అల్లం రాంబాబు ఆధ్వర్యంలో ఎస్సైలు సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్మెంట్‌పై విద్యార్థులకు అవగాహన



ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిర్మల్ టౌన్, జూలై 15 : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్మెంట్‌పై ఎయిర్‌ఫోర్స్ అధికారులు అనిల్ గోస్వామి, ఎస్టీ జాట్‌లు సోమవారం నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా యోజన క్రీడల అధికారి మచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ... ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్మెంట్ కొరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జూలై 5 నుంచి 28 జూలై వరకు చేసుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించి అక్టోబరు 18న రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు యువతి, యువకులు 3 జూలై 2024 నుంచి 1 జనవరి 2008 మధ్యలో జన్మించిన వారు ఉండాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ అర్హత, రాతపరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, ఉత్తీర్ణత సాధించిన వారికి ఫిజికల్, మెడికల్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి కార్యాలయంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మామిడి మొక్కలు నాటుతున్న అధికారులు

పెంబి, జూలై 15 : ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. సీఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మందపల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో 200ల మామిడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలన్నారు. సీఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో మామిడి మొక్కలు అందజేస్తున్నారని ఎవరికైనా కావాలంటే సీఆర్‌డీ ప్రతినిధి శ్రీకాంత్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుజాత, ఎఫ్ఏ సాంబన్న, సీఆర్‌డీ ప్రతినిధి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

కాగజ్‌నగర్, జూలై 15: నిరుద్యోగులకు సంఘీభావంగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్ నాయకులను సోమవారం కాగజ్‌నగర్ పోలీసులు ముందస్తు అరెస్టుచేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. వెంటనే డీఎస్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో నాయకులు దాసరి నరేందర్, రాజు, టక్కరి పోశం, శ్రీనివాస్, శోభన్, ధర్మేందర్, పాషా, మహిమూద్‌లతో పాటు తదితరులున్నారు.

జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: జిల్లాస్థాయి పోస్టర్‌మేకింగ్ పోటీలు ఆసిఫాబాద్ పట్టణంలోని జడ్పీసెకండరీ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.



ఉట్నూర్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న పీవో

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- గిరిజన దర్బార్‌లో పీవో ఖుష్బుగుప్త

ఉట్నూర్, జూలై 15: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధిపథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇందులో ఏపీవో జనరల్ కనక భీంరావ్, జీసీసీడీ ఎం.రామనందమ్, అదనపు వైద్యాధికారి కుడిమెత మనోహార్, ఏఓ సున్నంరాంబాబు, ప్రిన్సిపాల్ మేస్రం మనోహార్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, తదితరులు పాల్గొన్నారు.

- జాతీయస్థాయి హాకీ పోటీలకు గిరిజన క్రీడాకారులు

ఉట్నూర్: ఈనెల 19నుంచి 29 వరకు కేరళ రాష్ట్రంలోని కొలంలో జరిగే జాతీయ స్థాయి హాకీ క్రీడా పోటీలకు ఉట్నూర్ క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్‌లు తెలిపారు. సోమవారం జాతీయ స్థాయి హాకీ క్రీడా పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థులు పూసమ్ మోతిరాం, చౌహాన్ సాయిరాం, ఆత్రం జగ్జీవన్, జాదవ్ చరణ్, ఆత్రం శంబు, రాథోడ్ ధనరాజ్‌లను శాలువాలతో అభినందించారు. అనంతరం పీవో మాట్లాడుతూ జాతీయస్థాయి సబ్‌జూనియర్ హాకీ పోటీలకు తెలంగాణ జట్టు తరపున ఉట్నూర్ క్రీడ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం శుభపరిణామం అన్నారు. ఇందులో పీటీజీ ఏపీఓ ఆత్రంభాస్కర్, గిరిజన సంక్షేమ జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, హాకీ కోచ్ సునంద్‌లు పాల్గొన్నారు.

ఆందోళన కేసులో 20 మంది బీజేపీ కార్యకర్తల అరెస్టు

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఆదిలాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ కౌన్సిలర్ పిన్నావార్ రాజేష్(దొడ్డన్న) కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని నిరసిస్తూ ఆదివారం ఆందోళన చేపట్టిన 30 మంది బీజేపీ కార్యకర్తల పై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందులో 20 మందిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసు వాహనంపై దాడి చేయడం కీని లాక్కోవడంతో పలువురు బీజేపీ కార్యకర్తల పై కేసులు నమోదు చేశామని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. దీంతో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ కుమారుడు పాయలశరత్ (బన్నీ), జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నియోజక వర్గ ఇన్‌చార్జీ బోయర్ విజయ్‌తో పాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో బెయిల్ రాక పోవడంతో జైలుకు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

ఉదయం 6గంటలకు హైదరాబాద్ సర్వీస్

ఉట్నూర్, జూలై 15: ఉట్నూర్ ఆర్టీసీ డిపో నుంచి ప్రతీరోజు ఉదయం 6గంటలకు ఉట్నూర్ ప్రాంత ప్రయాణికులకు హైదరాబాద్ సూపర్ లగ్జరీ సర్వీస్ అందుబాటులోకి తెచ్చామని ఇన్‌చార్జీ ఆర్టీసీ డీఎం కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 11.30గంటలకు మరో సూపర్ లగ్జరీ ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు లక్షెటిపేట కరీంనగర్ మీదుగా బయలుదేరుతుందని ఉట్నూర్ ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం



హీటెక్కుతున్న.. బల్దియా రాజకీయం

- అవిశ్వాస తీర్మానంపై పట్టుబిగిస్తున్న ప్రధాన పార్టీలు
- ఆపరేషన్ ఆకర్ష్‌నే బలంగా నమ్ముకుంటున్న కాంగ్రెస్
- సభ్యులు చేజారిపోకుండా జాగ్రత్త పడుతున్న బీజేపీ, బీఆర్ఎస్
- కౌన్సిలర్లకు కాసులు కురిపిస్తున్న బల్దియా అవిశ్వాసం
- ఎత్తుకు పైఎత్తులు వేస్తూ.. క్యాంపుబాట పట్టిన కౌన్సిలర్లు

ఆదిలాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై ఈనెల 18న అవిశ్వాస తీర్మానాన్ని పెట్టేందుకు ముహూర్తాన్ని ఖరారు చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రధాన పార్టీలు గట్టెక్కేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య మున్సిపల్ అవిశ్వాసంపై పెద్ద యుద్ధమే జరుగుతోంది. పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగి పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి మరో 48 గంటల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో బల్దియా రాజకీయం మరింతగా హీటెక్కుతోంది. మొత్తం 49 మంది కౌన్సిలర్లకు గాను.. ప్రస్తుతం కాంగ్రెస్‌కు 13 మంది కౌన్సిలర్లు, బీజేపీ, బీఆర్ఎస్‌కు కలిపి 33 మంది, ఎంఐఎంకు ముగ్గురు కౌన్సిలర్ల బలం కనిపిస్తోంది. అదనంగా ఎమ్మెల్యే సభ్యత్వాన్ని నమోదు చేసుకోడంతో బీజేపీ, బీఆర్ఎస్ కూటమికి 34 మంది సభ్యుల మెజార్టీ ఉంది. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు ప్రతిపక్షాలు ప్లాన్ చేస్తుండ గా.. కాంగ్రెస్ మాత్రం ఎలాగైనా అవిశ్వాసం వీగిపోయేలా వ్యూహ రచన చేస్తోంది. ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డిలు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం జిల్లాలో ఎలాంటి ఎన్నికలు లేకపోయినా.. బల్దియా అవిశ్వాస తీర్మానం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

దూకుడు పెంచిన కాంగ్రెస్

మున్సిపల్ వైస్‌చైర్మన్ అవిశ్వాసం వీగిపోయేలా కాంగ్రెస్ మరింతగా దూకుడు పెంచింది. ఇప్పటికే ఆపరేషన్ ఆకర్ష్‌తో పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 13కు చేరింది. మరో ఇద్దరు ముగ్గురు బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే బీజేపీ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో పెద్ద ఆందోళనకు దారి తీసింది. చేరినట్లే చేరి బీజేపీ కౌన్సిలర్ చేజారీ పోవడంతో కాంగ్రెస్‌కు నిరాశే మిగిలింది. అలాగే ఎంఐఎం పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లపై కాంగ్రెస్ భారీ ఆశలు పెట్టుకుంటుంది. కానీ చివరకు ఆ ముగ్గురు కౌన్సిలర్లు ఎవరికి మద్దతుగా నిలుస్తారో?ననేది అంతుచిక్కడం లేదంటున్నారు. కాంగ్రెస్‌కు కాకుండా బీజేపీ, బీఆర్ఎస్ కూటమి వైపు ఎంఐఎం కౌన్సిలర్లు మద్దతుగా నిలుస్తే సునాయసంగా అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్‌కు పూర్తిస్థాయి మెజార్టీ లేక పోయినా.. అవిశ్వాస తీర్మానంపై ధీమాతోనే కనిపిస్తోంది. ఇందులో భాగంగానే సోమవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు క్యాంపు బాట పట్టారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల చేరికలపైనే దృష్టి సారిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలతో అడుగడుగున ఆటంకాలే ఎదురవుతున్నాయి.




క్యాంపునకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

ధీమాతో ప్రతిపక్షాలు

వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం తేదీ ఖరారు కావడంతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు ముందుచూపుతో క్యాంపుబాట పట్టారు. అవిశ్వాసంపై ప్రతిపక్ష పార్టీలు ధీమాగానే కనిపిస్తున్నాయి. ఏ మాత్రం అధికార పార్టీకి అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న అనుభవంతో ఎలాగైనా అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. శత్రువుకు శత్రువు మనకు మిత్రుడే అన్న చందంగా బల్దియా రాజకీయం కనిపిస్తోంది. బద్ధశత్రువులైనా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకటి కావడం కాంగ్రెస్‌కు కొంత ఇబ్బందికరంగానే మారింది. అధికార పార్టీ ఆశ చూపే పదవులకు కౌన్సిలర్లు చేజారీ పోకుండా జాగ్రత్త పడుతున్నారు. ఏఒక్కరు చేజారీ పోయినా.. అవిశ్వాస తీర్మానం నెగ్గడం అంతసులువేమీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వైస్‌చైర్మన్ జహీర్ రంజానీని ఎలాగైనా గద్దెదించి.. అధికార పార్టీపై పైచేయి సాధించేందుకు ప్రతిపక్షాలు పట్టుతో ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే నమ్ముకున్న కౌన్సిలర్లు చివరికి ఉంటారా?, హ్యాండిచ్చి అధికార పార్టీలో చేరిపోతారా? అనే అనుమానాలు బీజేపీ, బీఆర్ఎస్‌లను వెంటాడుతున్నట్లు కనిపిస్తోంది.

అడిగినంత ఇస్తేనే..

మున్సిపల్ వైస్‌చైర్మన్ అవిశ్వాసంతో బల్దియా కౌన్సిలర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. అయితే పదవీ కాలం కూడా దగ్గర పడడంతో నాలుగు పైసలు వెనుకేసుకునేందుకే పలువురు కౌన్సిలర్లు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. ఇన్నాళ్లు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు తీసుకున్న కౌన్సిలర్లు.. ప్రస్తుతం నువ్వా? నేనా? అన్నట్లుగా పరిస్థితి మారిపోవడంతో మరింత డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అవిశ్వాస తీర్మానానికి మరో రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో ప్రధాన పార్టీలు సభ్యుల సంఖ్యతో లెక్కలు వేసుకుంటున్నాయి. ప్రస్తుతం కౌన్సిలర్ల అవసరం కాంగ్రెస్‌కు ఉన్నట్లు కనిపిస్తోంది. దీంతో ఆ పార్టీ నేతలు ఆపరేషన్ ఆకర్ష్‌కు మరింత పదును పెడుతున్నారు. మరో ఇద్దరు ముగ్గురు బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. కానీ డీల్ కుదరకపోవడంతోనే ఆలస్యమవుతున్నట్లు సమాచారం. అడిగినంత ఇస్తే మద్దతునిచ్చేందుకు ఒకే చెప్పినట్లు తెలిసింది. ఇప్పటికే క్యాంపులు, ఆపరేషన్ ఆకర్ష్‌తో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న ఆయా పార్టీలు.. పంతం నెగ్గించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి.



సంక్షిప్త సమాచారం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్

'చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు'

ఆదిలాబాద్ రూరల్, జూలై 15: ఆదిలాబాద్ పట్టణంలో చెత్తా సేకరణలో నిర్లక్ష్యం చేయొద్దని సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ ఎండి ఖమర్ అహ్మద్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్‌తో కలిసి మున్సిపల్ జవాన్లు, ట్రాక్టర్ డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ జవాన్లు, ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

'డీఈవోపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్ రూరల్, జూలై 15: ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్ నియామకాల్లో పారదర్శకత పాటించలేదని డీటీఎఫ్ నాయకులు ఆరోపించారు. నియామకాల్లో అక్రమాలకు తెరలేపిన డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్ రాజార్షిషాకు వినతిపత్రం అందజేశారు. ఇలాంటి డీఈవో వైఖరి వల్ల జిల్లా విద్యాశాఖ సమాజంలో అభాసుపాలవుతోందని వారు పేర్కొన్నారు.



కూలిపోయిన స్థలాన్ని చూపుతున్న రైతులు

ఎద్దవాగు బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలి : రైతులు

బోథ్, జూలై 15: బోథ్ సమీపంలోని పెద్ద వాగుపై నిర్మించిన వంతెన ఓ మూలకు కూలిపోయిందని, తక్షణమే మరమ్మతులు చేయకపోతే మరింత కూలిపోయే ప్రమాదం ఉందని ఆ రూట్‌లో వెళ్లే రైతులు వాపోయారు. సోమవారం పగిలిపోయిన బ్రిడ్జి ప్రాంతాన్ని ఆ రూట్‌లో వెళ్లే రైతులు సందర్శించారు. బ్రిడ్జికి తక్షణం మరమ్మతులు చేయకపోతే భవిష్యత్తులో నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని వారు పేర్కొన్నారు. ఈ రూట్‌లో సోనాల, జీడిపల్లి, టివీటి గ్రామాల ప్రజలు ప్రయాణించడంతోపాటు పంట చేలకు వెళ్లే వ్యవసాయ కూలీలు వ్యాపారం నిమిత్తం తిరిగే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతే కాకుండా పశువులు వెళితే ప్రమాలు జరిగే ఆస్కారం ఉందని వివరించారు. ఇందులో సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేష్, చంద్రమోహన్‌రెడ్డి, బాబు, డాక్టర్ రాములు, నిమ్మల నర్సయ్య, గంగయ్య, గంగాధర్, లంక రమణ తదితరులు ఉన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- కలెక్టరేట్ సమావేశ మందదిరంలో ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యక్రమం
- పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 15: ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకుప్రత్యేక అధికారులుగా నియమితులైన అధికారులు ఫీల్డ్ విజిట్ చేయాలన్నారు. రోజువారి నివేదిక టూర్ డైరీ మెయింటెన్ చేసి ప్రతీనెలా 5వ తేదీలోగా రిపోర్టు సమర్పించాలని స్పష్టం చేశారు. వన మహోత్సవం సందర్భంగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.ప్రతి రోజు నాటిన మొక్కల వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇందులో ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

- 'రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలి'


గుడిహత్నూర్: రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జిల్లా కలెక్టర్ పర్యటించారు. మొదట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం కోరమండల్ దుకాణం తనిఖీ చేశారు. దీనిలో భాగంగా కలెక్టర్ ఎరువుల స్టాక్ రిజిష్టర్, ఈ పాస్ మిషన్ పరిశీలించి సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలు, ఎరువులు గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న గోదాంను పరిశీలించారు. అంతేకాకుండా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అందుబాటులో ఎరువులు ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆ తరువాత ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజా పాలన సేవ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజా పాలనకు సంబంధించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు గురించి ఎంపీడీవోను కలెక్టర్ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. కరెంట్ జీరో బిల్లులు, గ్యాస్, తదితర ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవోకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, జిల్లా సహకార అధికారి ఆత్మారం, ఏవో రేవతి, బ్రాంచ్ మేనేజర్ రవీందర్, సీఈవో కేంద్రే పండరీ, తదితరులు ఉన్నారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



గుడిహత్నూర్‌లో ప్రజా పాలన సేవా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటూ..



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

తక్షణమే మరమ్మతులు చేయించాలి

- సుంకిడి పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

తలమడుగు, జూలై 15: మండలంలోని సుంకిడి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ప్రాథమిక పాఠశాలలను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సుంకిడి పాఠశాలలు శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడుతున్న తరగతి గదులను పరిశీలించి వాటిని తక్షణమే మరమ్మతులు చేయించాలని మండల విద్యాశాఖ అధికారి నారాయణను ఫోన్ ద్వారా ఆదేశించారు. మన ఊరు మన బడిలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో నిర్మించబడ్డ నాలుగు గదులను వర్షాకాలం పూర్తయ్యేంత వరకు నాలుగు నెలల పాటు ఉన్నత పాఠశాల తరగతుల బోధన కోసం వాడుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిది, తొమ్మిది, 10వ తరగతి విద్యార్థులతో తరగతి గదిలోకి వెళ్లి కష్టపడి చదవాలని సూచించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులతో గణితం లెక్కలు చేయించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఇందులో పాఠశాల ఇన్‌చార్జీ హెచ్‌ఎం గజానన్, వై.రామ్‌రెడ్డి, సుకుమార్ పెట్కూలే, శ్రీనివాస్ రెడ్డి, సుజాత, నాందేవ్, ప్రైమరీ హెచ్‌ఎం, రాజేందర్ తదితరులు ఉన్నారు.

జీవో నెం.10 వెంటనే రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ఎదుట ధర్నా
- పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 15: అంగన్‌వాడీల శ్రమను అగౌరవ పరిచేలా ఉన్న జీవో నెం.10 ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న పట్టించుకోని కారణంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీక్ష శిబిరం కలెక్టరేట్ నుంచి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బైఠాయించి సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హాయంలో హక్కుల సాధనతో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం సమ్మె చేశామన్నారు. సమ్మెతో దిగివచ్చిన ప్రభుత్వం టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయల బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చిందని, కాని జీవో చేయలేదన్నారు. సమ్మె కాలంలో కాంగ్రెస్ నాయకులు శిబిరాలను సందర్శించి మద్దతు తెలిపాయని, అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యల పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ అధ్యక్షురాలు వెంకటమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సునిత, నాయకురాలు పార్వతి, అనసూయ, పద్మ, విశాఖ, లక్ష్మి, నజీమా, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: గత ప్రభుత్వం హాయాంలో సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు సమ్మె చేస్తున్న సమయంలో తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నారు. సోమవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఉట్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉట్నూర్ ఇంద్రవెల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు ముట్టడించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు సునిత మాట్లాడారు. కాగా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి చేపట్టడంతో సీఐ గండికోట మొగిలి, ఎస్సై మనోహార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టిబందోబస్తు చర్యలు చేపట్టారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ముక్కబాయి, పద్మ, కోసుబాయి, సుభద్రత, నర్మదా, స్వర్ణలత,రేణుక, సులోచన, మీనాకుమారి, కాటం సంగీతారమేష్, మలంబాయి, లైక్‌బేగం, కవిత, తదితరులు పాల్గొన్నారు.

నేరడగొండ: జీవో నెం.10ని రద్దు చేసి అంగన్వాడీ టీచర్, హెల్పర్‌లకు రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచాలని కోరుతు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు హెల్పర్‌లు టోల్‌ప్లాజా కార్మికులు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. విషయాన్ని అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇందులో సీఐటీయూ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు



ఉట్నూర్‌లో ఎమ్మెల్యే పర్సనల్ సెక్రెటరీకి వినతిపత్రం అందజేస్తున్న సమ్మెచేస్తున్న అంగన్‌వాడీలు



నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు